# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮.
సంచిక ౪౪.

కాకినాడ:—శనివారము, నవంబరు, ౫, ౧౯౨౧.

చందా సం॥ రు ౩.
విడిసంచిక అ ౧.


## ఓమ్.

కరుణావృష్టికి తనయుఁడు గాచి కాచి
యార్తి యయ్యెను బాపము వలన తీవ్ర
సర్వ సుఖములయందు నాసక్తి త్రొక్కి
పరితపించెద కానలో బడితి యకట!
కాఱుమబ్బులు గ్రమ్మెను గాననమున
త్రోవ దెలియదు లోనికి బోవుటకును
వెలుగు లేదయ్యె నుంతేని వెఱచి ఫలము
లేదు కాబట్టి తండ్రిని లేపి వెంట
బెట్టుకొని పోవ జూచెద బిట్టు వగచి
వెలుగు వీనులు పగులగ బలికె దేవు
పాప సముదాయమును దలచి పరితపించి
భయము పడితిని నామ విన్నపము వినుము!
దర్శనము నిచ్చి సత్కార్య తత్పరుండు
గాగజేయుము లేకున్న బాగుపడను
నీదు నాజ్ఞల జవదాట గాదు నాకు
వాని నెరవేర్చి నీ ప్రేమ పాత్రుడగుదు
ప్రాణముల మీఁది తీపి యపారమగుట
బాయలే నిక విశ్వము పరమ పురుష
విశ్వమును జూచి నేను నివ్వెఱగు జెంది
నీదు మహిమల దిలకింతు నాథ వెదకు
గన్న గావుము దేవ నీకె సన్నుతింతు.

వే. వెం.

---

"లోకము నైతిక సిద్ధాంతములచే బంధింపబడినది. నైతిక విధులు నిర్మూలించు నపుడు లోకనిర్వాహణ మసాధ్యముగ దోచును. నైతిక వైరుధ్యము వలన విప్లవములు సంభవించును. రాజ్యములు వనసీమలగును. సంస్కరణములు సంహారణము లగును. కారు మేఘములచే నాకసము విపరీతముగ గప్పబడును గాని యపి యదృశ్యము కాగా వినిర్మలముగను విస్ఫుటముగను వినీలముగను గప్పడి గంభీర నినదముచే నొప్పుచు ప్రశాంతి స్ఫురణకై దోచును"

Alexander Dumas, fils.

"క్రైస్తవమతము నందొక తెగవారు బైబిలు పఠనమునకు శూద్రులు వేదపఠనమునకు వలె నిరోధింప బడినవారయ్యు నాత్మ ప్రబోధిత వర్తనముచే నీశ్వర సారూప్యమును బొంద జాలిరని చరిత్ర వలన దెల్లమగు చున్నది. అనుతాపము వారి కుండిన పాప భయమును బోగిట్టినది."

Rom. II.

మృగత్వము మనకు చెల్లదు. సత్కార్యాచరణము వలన కీర్తికాయములను బొందుదము. బానిసత్వమును దోలి స్వాతంత్రితను గల్గి యుందము. కష్టపరంపరల కోర్చి యాత్మ పరిశోధనలను గావింప గడంగుదము. మన నివాస స్థలములు శాంతి నికేతనములై స్వర్గధామములుగ జేసికొందము.

Moral Science.
వే. వెం.

---

సత్యమేవ జయతే

ధర్మసాధని

శనివారము, నవంబరు, ౫, ౧౯౨౧.

## యోగము.

ఉపాసనయొక్క ఫలము యోగము తప్ప నింకేమియు కానేరదు. విశ్వవ్యాపకుడును, విశ్వాతీతుడు నయిన పరమేశ్వరునితో నైక్యమగుటకె మానవాత్మ యభిలషించును. పరిమితములయిన క్షుద్ర వస్తువుల మూలమున దాని క్షుధ తీరదు. వస్తు వాహనాదులు, సమస్త భోగ భాగ్యములు, ప్రపంచము నంతయు త్యజించి యైన ఈశ్వరుని పొందుటయె దాని లక్ష్యము. ప్రపంచ సంబధ మయినవి యేవి గైకొన బడినను ఈశ్వరోపలబ్ధికి ఉపకరణములుగ, సాధనములుగ మాత్రమె గైకొన బడును. ఆటలయందు బాలుడు కొయ్య గుర్రముమీద నెగురుటకు చెక్కను సాధనము జేసికొనును. వేటలయందు వేటగాడు తన అంబును గమ్యస్థానము చేర్చుటకు విల్లును సాధనము జేసికొనును. అటులనె ఉపాసనయందు సాధకుడు సకల ప్రాపంచిక విషయములను పరమేశ్వరుని పొందుటకు సాధనములు జేసికొనును. ఐహిక పదార్థముల వలన ప్రయోజనము గలదు. మనము వానిని సంపాదింప వలెను, ఉపయోగింప వలెను. ఎందునకు? వానికంటె మహత్తరమయిన పరమాత్మను పొందుటకె. వానిని బడయుట తిరిగి విడుచుట కొరకె. కావున హిందువుల యాదర్శము త్యాగము అని మహాత్మాగాంధి చెప్పెను. ప్రపంచ వస్తువులు మనకు తోడ్పడుటకు మన ప్రయత్నమేమియు లేకుండనె, పుట్టుకతోడ ఈశ్వరానుగ్రహమున లభించుచున్నవి. అవి మనల నెచ్చటికి గొంపోవుట కుద్దేశింప బడినవో తెలిసికొని, అవి కనపరచు పరమావధిని ప్రేమించి సమస్త జీవిత కార్యముల యందు పొందుటకె మన పూర్ణయత్నమయి యుండవలెను. ఈ కృషియందు జ్ఞానము, భక్తి, కర్మ మూడును మిళితము లగును, జ్ఞానముతో భక్తి, భక్తితో కర్మ, ఒకదానితో నొకటి చేరియుండును. యోగాభ్యాసము నందు అవి మూడును కలసి పనిచేయుచున్నను, వానిలో నేదియొ యొకటి విశేషముగ గాన్పించవచ్చును. ఏది విశేషముగ నుండునో దానిని బట్టి కొందరు జ్ఞానయోగులని, కొందరు భక్తియోగులని, కొందరు కర్మయోగులని పరిగణింప బడుదురు. రాజర్షి రామమోహనుడు జ్ఞానయోగి, బ్రహ్మానంద కేశవచంద్రుడు భక్తియోగి, మహాత్మా గాంధి కర్మయోగి అని వారి జీవనముల చూచిన తోడనె స్పష్టముగ తెలియును. ఇటులనె యితర సాధకులును ఏ శ్రేణికి జెందుదురో గుర్తింపవచ్చును. దీక్షను బట్టి చూచినను, త్యాగమును బట్టి చూచినను, గాంధి మహాత్ముని మించినవారు కర్మయోగమున ఇంకొకరు ఈ నవయుగమున లేరనుట యతిశయోక్తి యెంత మాత్రము గాదు.

## పారిశుద్ధ్యము.

యోగసాధనయందు ఆత్మ పారిశుద్ధ్యము ముఖ్యము. శరీర పారిశుద్ధ్యము ఆత్మపారిశుద్ధ్యమునకు సాయపడును గాన శరీర శుచి యెడను సాధకుడు శ్రద్ధ వహించును. ఏది హీనము, నికృష్టము అని తలంపబడునో, దానిని ద్వేషించుట, ఉన్నతి పరుపకుండుట అనుచితము. కాని, తన యభివృద్ధికొరకు సాధకుడు దుష్ట సాంగత్యము విడిచి సత్సాంగత్యము సలుపునప్పుడు ఆతడు అక్రమముగా నడచుచున్నాడని యెవరును అనరు. భోజన పానీయముల విషయమున ఆతడు నియమముల పెట్టుకొనును. కొన్నిటిని విసర్జించును; కొన్నిటిని గ్రహించును; గ్రహించినవి తిరిగి విడుచును. ఆశ్రమ విధానము ఇట్టి ప్రణాళితో కూడియున్నది. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము—ఈ నాలుగు ఆశ్రమములందు ఆత్మాభివృద్ధికి వలసినటుల విధి నిషేధ నియమములు చక్కగ చెప్పబడినవి. ఆశ్రమ విధానము దాదాపు పూర్తిగ దేశములో అంతరించినది. ఎవ రెవరికి ఏయే కార్యములు చేయుట కర్హత గలదో, ఆ విచక్షణయె

పోయినది. బ్రహ్మచారిగా నుండదగిన వాడు, గార్హస్థ్యధర్మములు, గృహస్థుడుగా నుండదగినవాడు సన్న్యాస ధర్మములు నిర్వర్తించుటకు పూనుటచే నెట్టి వైపరీత్యములు సంఘమున ప్రబలియున్నవో కన్నులార గాంచుచున్నాము. ఎవ రెవరి యోగ్యతకు తగినటుల వారు నాలుగు ఆశ్రమములు క్రమముగ నడపుటకు మహాత్మా గాంధి తన ఆశ్రమములో నేర్పాటుచేసి ఆశ్రమ విధానమును పునరుద్ధరించుట యెంతయు ప్రశంసనీయము. శరీరారోగ్యమునకు కొన్ని సమయములలో కొన్ని వస్తువులు పనికిరావు. అవి యితర సమయములందు పనికివచ్చును. కాని అప్పటి కవి నిషేధములె. ఆత్మారోగ్యమునకై కూడ విషయ సంసర్గమునం దిట్టి నిబంధనము లుండుట ఆత్యావశ్యకము.

## సౌభ్రాత్రము.

ఆత్మపారిశుద్ధ్యము కొన్ని బాహ్యవర్తనముల ద్వారమున ప్రకటితమగును. అసలు ఏ వర్తనములేక యుండునది జడముగాని ఆత్మకాదు. ఆత్మ సజీవమయినది. మనోవాక్కాయముల ద్వారమున అనేక కార్యములను సలుపును. ఆ కార్యము లున్నంతవరకె ఆత్మ యున్నదని, అవి లేనితోడనె ఆత్మ లేచిపోయినదని మన మెంచుదుము. పవిత్రత నొందిన యాత్మ తన కార్యములందు పవిత్రతను వ్యక్తపరచును. కార్యము లపవిత్రము లయినను, హృదయము నిర్మలముగా నుండునని తలంచుటే యసాధ్యము. సదనుష్ఠానము ఆత్మ పారిశుద్ధ్యమునకు నిదర్శనము. పవిత్రతను ఉన్నతిని జెందుట యన ఈశ్వర స్వభావము బడయుటయె. ఈశ్వరుడు ప్రేమ స్వరూపి. ప్రేమయె ఈశ్వరుడు. సాధకుడు రానురాను ప్రేమయందు పెరుగును. కేవల స్వార్థపరుడై తన సుఖము కొరకె తాను జీవింపక తన చుట్టుపట్లనున్న మానవుల యెడ ప్రేమజూప మొదలిడును. మొదట తన కుటుంబములోని వారిని, హృదయము విశాలమయిన కొలది తన దేశములోని వారిని, తరువాత మానవులందరిని, సుఖపెట్టుటకు ఆత్మసమర్పణము గావించును. తోడిమానవుల యెడ జూపు ప్రేమ సౌభ్రాత్ర మనబడును. వృత్తిభేదములు, ఐశ్వర్యభేదములు, మతభేదములు, దేశభేదములు ఏకమానవ జాతిని భిన్నకూటములుగ విభజించును. ఈవిభాగములు అనివార్యములు; కాని భ్రాతృవాత్సల్యమునకు, పరస్పర సాహాయ్యమునకు అడ్డురావు. ఆసంఘముల జీవనము నదులగతివలె నిరంతర పరిణామమునకు లోనైనదని రవీంద్ర కవిశేఖరుడు వర్ణించెను. వృత్తులు, కలిమిలేములు, మతాభిప్రాయములు, వాసస్థలములు కాలోచితముగ మారును. ఆ మార్పుతోపాటు సంఘములందలి వ్యక్తులు, సంఘముల యొక్క రూపములు సహజముగ మారును. అట్టి మార్పుల నిరోధించు నిర్బంధ శాసనములు సర్వమానవ సౌభ్రాత్రమునకు విరోధములు. వానిని సాధకు డతిక్రమించును. స్వాభావికమగు వృత్తి వివక్షతను తెలుపుటకు వేదకాలమున నుద్దేశింప బడిన వర్ణములు నేడు నలువైపుల బంధింపబడిన తటాకములవలె మారి యనర్థదాయకము లయినవి. గాంధి మహాత్ముడు ప్రకృత వర్ణభేధమును గాక వేదకాలపు వర్ణభేదమును అంగీకరించుచున్నాడు. అప్పటి వర్ణ వివక్షత పవిత్ర జీవనమునకు ప్రతికూలము కానంతవరకు అన్య వర్ణస్థులతో భోజన బాంధవ్యములకు ఎడమిచ్చును. మహమ్మదీయుల హస్తము నుండి ఆహారపానీయములు గైకొనుటకు, పంచమ బాలికను దత్తత జేసికొనుటకు, వర్ణభేదము గాంధి మహాత్మున కడ్డువచ్చుట లేదు. కాని భోజన బాంధవ్యముల విషయమై కొన్ని నియమము లుండవలెనని చెప్పునప్పుడు, ఆతడు ప్రచలిత వర్ణభేదమునె బలపరచు చున్నాడని కొందరకు దోచవచ్చును. సంస్కరణ పరాయణులలో ఒక ఆస్తిక సాత్వికాహారిని తీసికొందము. ఆతడు మాంసభక్షణ, మద్యపానముల కలవడిన నాస్తికురాలిని వివాహము చేసికొనుటకు ఇచ్ఛగింపక ఆస్తిక సాత్వికాహారుల సంఘము నుండియె తన వధువు నెన్నుకొను నప్పుడు, వానికి వర్ణ వివక్షత కలదని యెంచుదుమా? ఆతడు కూడని యాహారము భుజించువాని ప్రక్కన కూర్చుండి భుజించుటకు అభ్యంతరము చెప్పునప్పుడు, వానికి వర్ణవివక్షత కలదని యెంచుదుమా? వర్ణ విధానము శుచి నియమములపై నాధారపడి యుండక పోయినను శుచి నియమముల ననుసరించుట ప్రతి వర్ణస్థునకు కర్తవ్యమని మాత్రము గాంధి మహాత్ముని యభిప్రాయము. కాని గాంధి మహాత్ముడు చెప్పినట్లు నాలుగు వర్ణములు సహజరీతిని తిరిగి నడచుట కెంతయో సంస్కరణ మావశ్యకము. బ్రాహ్మణులని పిలువబడు వారిలో బ్రాహ్మణులు కానివారు గలరు. అటులనె, క్షత్రియు

లని, వైశ్యులని, శూద్రులని, చెప్పబడు వారిలో ఆ యా వర్ణవృత్తుల నవలంబింపని వారు గలరు. వర్ణములు చాల తారుమారయినవి. ఏదో విధముగ నిప్పుడున్న వర్ణముల నిలుపుట గాంధి మహాత్ముని యుద్దేశమెంత మాత్రము కాదనుట ఆతని వర్తనము వలన, బోధనల వలన స్పష్టము.

## భూతదయ.

మానవుడు మానవజాతినే గాక సర్వప్రాణి కోటిని ప్రేమింప గలడు. బుద్ధదేవుని ప్రయత్నముల వలన హిందూదేశమున భూతదయ యొక్క యుత్తమ ధర్మముగ స్థాపితమయ్యెను. పశువుల యెడ, పక్షుల యెడ, సకలేతర జీవులయెడ ప్రేమ చూపనంత వరకు మానవుని హృదయము పూర్ణవికాసము గాంచలేదనియె భావించు స్థితికి హిందువులు వచ్చిరి. అట్టితరి, ఎక్కువ యుపయోగకారియై పవిత్రమయిన గోవు వధింపబడుటను తమ దేశములోనె హిందువులు చూడవలసి వచ్చెను. ఆవధ మతము పేరిట జరపబడుటచే వారి యసహనమునకు మేరయె లేకపోయెను. గోవధ సంబంధముగ హిందూ మహమ్మదీయులకు తీరని కలహము లేర్పడెను. గోరక్షణము హిందువుల భూతదయను ప్రకటించు ఒక ప్రత్యేక విషయము. గోరక్షణమునకు పురిగొల్పుచున్న మూలధర్మము భూతదయ. కావున గోరక్షణమునుండి గ్రహింప వలసిన ధర్మము భూతదయ యని గాంధి మహాత్ముడు విశదీకరించెను. బుద్ధదేవునితో గాంధి మహాత్ముడు సరిపోల్ప బడుట యెంత సమంజసమొ భూత దయకు గాంధి మహాత్ముడొసంగు ప్రాముఖ్యత వలన బోధపడ గలదు. మానవ సౌభ్రాత్రమును, భూత దయను నెలకొల్పుటకు అవతరించిన ప్రేమమూర్తి యని గాంధి మహాత్ముడు కీర్తింప బడుచున్నాడు. వాని సంస్థాపనమునకు అడ్డుగనున్న అన్ని విధములయిన నిరంకుశత్వమునకు తాను బలియగుటకయి సిద్ధముగ నున్నాడు. ముఖ్యముగ యీవద్భరతవర్షనందు నేడు ధర్మజీవనమునకు గాంధి మహాత్ముని జీవనమె ఆదర్శప్రాయమయినది.

## అహింస.

ధర్మము పేరటనె హింస యెంతయో గావింపడును. ధర్మము వైపునకు జనులను మరల్ప వలెనను సదుద్దేశముతో అనేక విధములయిన దౌర్జన్యములు పొడసూపును. ధర్మము కొరకైనను దౌర్జన్యము పూనుట తగదని గాంధి మహాత్ముడుపదేశించుచున్నాడు. గోరక్షణమునకు మహమ్మదీయుల బాధించుటగాని, నిరంకుశ ప్రభుత్వ నిర్మూలనమునకు ఆంగ్లేయుల పరిమార్చుట గాని, అగ్రవర్ణముల అన్యాయ మణచుటకు అగ్రకులజుల రూపుమాపుట గాని ఆత డామోదింపడు. ఎవరే యక్రమము తొలగించుటకై పూనిననూ ఆయక్రమమునకు తాము హతము కావలసినదె గాని అన్యులకు హాని చేయగూడదు. అభిప్రాయ భేదములు క్రోధమునకు, ద్వేషమునకు, కలహమునకు కారణము కాగూడదు. ఒకడు తన సహనము చేతనె, ప్రేమచేతనె, శాంతము చేతనె యితరులను తన మార్గమునకు త్రిప్పుకొన యత్నింపవచ్చును. తాను చెప్పునది సత్యమె యయినచో తప్పక జయించును; పరులను కూడ వశపరచుకొనును. మన దేశమున ప్రకృతము మత సాంఘిక రాజకీయ పరిస్థితులన్నియు జనులను దౌర్జన్యమునకు, దుండగములకు పురిగొల్పునవిగ నున్నవి. గాంధి మహాత్ముడొసంగు అహింసా సందేశము దేశీయుల చిత్తశాంతికి తోడ్పడ గలదు. అహింసావ్రతము మన దేశమున వ్యాపించి పశుబలముకంటె ఆత్మబలము శ్రేష్ఠతరమయిన దని ఋజువయిన యెడల మానవ లోకమునకు మహోపకారము కలుగు మార్గము చూపబడి నట్లగును. ఘోర యుద్ధములు తలంచుకొని ప్రపంచములోని అందరి హృదయములు వియుచున్నవి. వాని రూపుమాపు నుపాయము కొరకు ప్రతి దేశస్థులు ఆతుర పడుచున్నారు. గాంధి మహాత్ముని సదుద్యమము జయప్రదమై లోక కల్యాణమునకు తోడ్పడును గాక!

## కర్తవ్యము.

ప్రకృత కర్తవ్యముగ గాంధి మహాత్ముడేదితన జీవితములో పెట్టుకొని స్వదేశీయుల కాదేశించుచున్నాడో యది తెలుపు ఆతని యీ క్రింది మాటల నెల్లరు బాగుగ గమనింతురు గాక!

“హిందూదేశములో నస్పృశ్యతా దోషముండుట కేవలము రాక్షసకృత్యము కాని వేరుకాదు. ఆ దోషమును పోగొట్టుట వలననే స్వరాజ్యము సులభముగ సిద్ధించును. దీని విషయమై శ్రద్ధ చూపబడు

చుండుటచే దీనికి నే నన్నిటికంటె ప్రాధాన్య మిచ్చితి ని. నిరాకరణము మహాపవిత్ర్యకృత్యము. దీనికి భగవదనుగ్రహ మవసరము. మనము దానిని కోరుచుంటి మి. కాని భగవానునకు ప్రియమైన సంతానమగు పంచములను మనము మానవ మాత్రులుగ నెంచక దయను కరుణను చూపుట లేదు. నేను తిరిగి పుట్టుట భగవత్సంకల్ప మైనయెడల నేను బ్రాహ్మణుడుగ పుటవలెనని కోరను. వైశ్యునిగగాని, క్షత్రియునిగగాని, శూద్రునిగగాని పుట్టవలయు ననియు కోరను. పంచముడుగనే పుట్టి వారిలో కష్టముల ననుభవించి వారిని తరింపజేసి నేనును తరింతును. అస్పృశ్యత యీ ప్రాదిలోనె పోవలెను. నాకు గోవును రక్షింపవలె ననియు, పంచముల నుద్ధరింప వలెననియు రెండే కోరికలు. ఈ రెండు మనోరథములును సిద్ధించినపుడే మనకు స్వరాజ్యము లభించును. నేనును తరింతును.

---

ఆది హిందువుల సమావేశము:—

ఈనెలలో హైదరాబాదు, సికింద్రాబాదులలో రెండు సభలు జరుపబడినవి. యిందులో ముఖ్యులగు జాతీయనాయకులు చేరి స్వజాతి యభివృద్ధికొరకు తగిన సన్నాహము లే విధముగ పన్నవలయునో అను విషయములు చక్కగా సమర్థించిరి. ఆగామి డిశంబరు మాసములో జరుపుటకు నిశ్చయించిన కాన్ఫరెన్సును, యువరాజు శుభాగమనము వలన నిలుపబడి, ౧౯౨౨ మార్చి, ౨౯, 30, 3౧ తేదులలో జరుపుటకు నిర్ణయించిరి. కావున ప్రతి గ్రామ ఆది హిందూ నాయకులు దయచేసి సభను జయప్రదముగా జరుపుటకు ప్రార్థించుచున్నారము. అని (ఆది హిందూ సేవా సమితి) జాతీయ సేవకుడు, భాగ్యరెడ్డి వర్మగారు వ్రాయుచున్నారు.

---

శ్రీ దయానంద గ్రంథాలయము:—

ముదివేడు (కురబలకోట పోస్టు, చిత్తూరుజిల్లా) గ్రామమున నొక ధర్మపుస్తక భాండాగారమును రాత్రి పాఠశాలను నిర్మించుటకై సల్పుచుండిన ప్రయత్న విషయమును మ॥రా॥శ్రీ కరణము రెడ్డెప్పగారు గ్రహించి పుస్తక భాండాగారమును నిర్మించుకొనుటకై రెండెకరముల భూమిని సహాయము చేసియున్నారు. మఱికొందరు విద్యాభిమానులు నూఱాంధ్ర గ్రంథములు నేబది హిందీ గ్రంథములను ధర్మముగ నొసగియున్నారు. ఈమాత్రపు సహాయమున నే గ్రంథాలయ నిర్మాణమునకును, విద్యాభివృద్ధికిని దోడ్పడజాలదను సంశయ మెవ్వరు బోలు మహాశయు లెరుగనిది కాదు. గ్రంథాలయమును నిర్మించుటకు గలపయిను, విద్యాభివృద్ధికి గ్రంథములును (లేక) ధనమును దమకు దోచినరీతిని సహాయముజేసి యీ కుగ్రామ దండ్రి గ్రంథాలయ విద్యాభివృద్ధికి తోడ్పడుదురని తమవంటి దేశాభిమాను లందరను బ్రార్థించుచున్నారము. ధనము గాని, గ్రంథములు గాని, మరి యే విధమయిన సహాయము గాని చేయవలచిన ధర్మదాతలు ఈ సమాజ కార్యదర్శికి పంపవచ్చును.

ఎస్. సుబ్బోజీరావు, కార్యదర్శి.

---

ఆంధ్రబ్రాహ్మమండలి, కాకినాడ:—

ఆంధ్రబ్రాహ్మమండలి యొక్క కార్యనిర్వాహకసంఘము 30-౧౧-౨౧ తేదిన కాకినాడలో సమావేశమయి చీరాల సమాజమందిరము మరమతునకు గాను ౨౧ రూపాయ లిచ్చుటకును, మండలి తరఫున జరుపదలంచిన ఆస్తిక సమావేశము నవంబరులో గాక డిశంబరులో క్రిస్మస్ దినములలో కడియములందు జరుపుటకును, ఆ సమావేశ కార్యములు శ్రీ పెద్దాడ రామస్వామిగారు ఎమ్. ఏ. చూచుటకును తీర్మానములు చేయబడెను.

వి. పి. రాజు, కార్యదర్శి.

---

# ఆత్మపరీక్ష.

—o:o:o—

సహోదరా! ఆత్మపరీక్షయే నీ జీవితమును బవిత్రవంతముగ మార్పగలదు. నీ లోపములు నీకు దెలిసినంత చక్కగా నెవరికిని దెలియవు. ఉషఃకాలమున నిద్రలేచి పరిశుద్ధుడవై భగవంతుని బ్రార్థింపుము. కీర్తింపుము. ధ్యానింపుము. అపుడు నీ చిత్తమున కెంత శాంతి కలుగునో? ఎంత ఆనందము కలుగునో? నీవే యితరులకు బోధింపగలవు. ఈపని చేయనిదే ఆత్మ పరీక్షకు అర్థాతయే లేదు. తనుపరి నావలన లోకమున కేమి యుపకారమున్నది. నన్ను మానవునిగా సృజించినందులకు భగవదుద్దేశమునకు నే నెంతవరకు సాయపడితిని; అని ప్రశ్నించుకొని విచారింపుము. అపుడు హిమాలయ పర్వతమంతగ భారము నీపైన నున్నదని తెలిసికొనగలుగుదువు. ఆ వెంటనే గర్వము నిన్ను విడిచిపోవును. నమ్రస్వభావము నిన్ను వరించును. నీ లోపములను దొలగించుకొనుటకు బ్రయత్నపడుదువు. నీవు ఇంద్రియ నిగ్రహము లేనివాడ వైనచో జితేంద్రియుడ వగుదువు. పరద్రవ్యాభిలాష గలవాడ వైనచో విరాగ పురుషుడ వగుదువు. హింసాపరుడ వైనచో అహింసావ్రతుడ వగుదువు. పరవంచకుడ వైనచో విశ్వాసపాత్రుడ వగుదువు. అసత్యవాది వైనచో సత్యశీలుడ వగుదువు. కువిమర్శకుడ వైనచో సువిమర్శకుడ వగుదువు కోపి వైనచో శాంతుడ వగుదువు. లోభి వైనచో త్యాగి వగుదువు. కఠినుడ వైనచో దయాపరుడ వగుదువు. వేయేల పూర్ణముగా నీవు నూతనావతారమును దాల్తువు. గుణగ్రహణ శక్తి గలవాడ వగుదువు. కనుక ఆత్మపరీక్ష జేసికొనుచుండుము, గురు బంధు జనుల కంటె ఆత్మపరీక్ష నీ కమూల్యమైన సాహాయ్య మొనరించును. తొందరపాటును విడిచి ఆత్మపరీక్ష జేసికొనుచుండుము, అదియే నీకు మహాత్మ్యము నొసంగి యిహపరములను సమకూర్చును. గ్రంథవిస్తరభీతిచే విరమించుచున్నాడను. ఇది మహావిషయము. తప్పక ఆచరణలో బెట్టవలెనని తిరిగి విన్నవించుచున్నాడను.

కొప్పివ్వాడి శేష వేంకట కాశీపతి.

---

# ముక్త పురుషుడు.

—:o:o:o:—

ఆది యంతంబు లేనట్టి ప్రభుడొకండు,
భువిని సృష్టించి, పోషించి, పొలుపుమీర
ప్రేమతో గాచి ప్రియమున వర్ధిలంగ
దయయు, సత్యంబు నొడగూర్చి ధర్మ మిలను,
విరివిగా వ్యాప్తి జెందంగ విమలమైన
మానవాత్మను సృజియించె మహిమ మీర.
ఆత్మ యొక్కటే నశ్వర జీవనంబు
పడసి పుడమిపై నద్భుత తేజ మొసగ
తండ్రియని యీశ్వరు ప్రస్తుతించు
గాతయని తానెంతో దీనమగుచు
భక్తిశ్రద్ధల జూపించు, భయము వీడి,
పూర్ణ విశ్వాసమున మించి ప్రేమగల్గి
ప్రభుని దయగోరి నాతని నాజ్ఞదెలిసి,
యమరధామంబు జేరంగ ననిశమెదను
ముక్తి సాధన పథమున మునిగియుండు.
ఇరుగు పొరుగుల వారలు ఇలను మిగుల
శ్రమను బడుచుండి శాంతి లేకుండయుండి,
స్వామి యెక్కడ నున్నాడు? సత్యమునకు
కాల మిప్పుడు కాదంచు కఠినవృత్తి
తినుట కన్నంబు, ధరియింప వస్త్రములును,
నిలువ నీడయు లేకుండ నీచవృత్తి
మెలగు చుండంగ జూచియు జూడనటుల
తాను నటియించి తద్దయు ఘనతమీర
దేవళంబుల నిర్మించి, దివ్యమైన
భూషణాదులు ప్రతిమల పాలుజేసి
భక్తిపరుడంచు భజనలు సల్పగానె
ఫలము లేదంచు భక్తితో మానవుండు,
ప్రీతి మీరంగ తన తోడి మానవులను,
ప్రియము గూర్పంగ నీశుండు తనివిజెందు.
గాన నంతకంటెను ఘనమైన యర్చనంబు
నాది దేవుని కర్పింప నెఱితరము?
ఆర్యజనులకు వేదంబు లొసగ లేదె?
ఆరబులకు గూడ కొరాను యొండలేదె?
పారసీకుల కెల్లను జెండయే యండగాదె?
యూద క్రైస్తవ మహా జనుల కెంతో
బైబిలంటెను ప్రాణపదంబు గాదె?
కాలరీతిని కనిపెట్టి తనదు మహిమ
లంతకంతకు వింతలు గొల్పునటుల
వివిధరీతుల నన్ని కాలంబులందు
నూతనత్వము మానక మానవాళి
గూడి విరతంబు లీలలు సల్పుచుండ
సత్యమంతయు తనకె లభియించినటుల
దలచి దేవుని తనవలె సాక్షికునిగ
జేయ సమకట్టు పామర మానవుండు,
సత్య మెచ్చట నున్నను జంకులేక
స్వీకరింపంగ జాలడు క్షుద్రబుద్ధి.
సత్యమే గద స్థిరమైన శాస్త్రచయము?
సత్యమునకు మించి దైవంబు గలడె భువిని?
కాన సత్యంబు మది నెంచ ధర్మనిరతి
సాధుసంఘ మపేక్షించి మెలగుచుండు,
ధీర భక్తుల గూడుచు దిరుగుచుండు,
ధర్మవీరుల దరిజేరి ధైర్యముగను
స్వామిసన్నిధి గోరుచు సంతసముతో
నాథు పరమేశు నొక్కనినె పూర్ణుడనుచు
నతనితో పోల్పదగినట్టి మానవుండు
మహిని లేడంచు దృఢముగా నెఱిగియుండు,
విశ్వమే యొక మహా కుటుంబంబు గాగ
విశ్వనాథుండె దానికి ప్రభువు గాగ
విశ్వజనులను బ్రోచెడి తండ్రియైన
తనదు స్వామిని గొల్వక తనకు శాంతి
యెటుల సమకూర గలదంచు మానవుండు
తోడి మనుజుల తనవలె జూచుకొనుచు,
సోదర ప్రేమ జనకున్న సుఖము బడయ
నన్యమార్గంబు లేదంచు తెలిసికొనియె.
తాను జేసెడి కార్యంబులకును దానె
కర్తగా నెంచి ఫలమును ననుభవించి,
ఈశు మది నెంచి, ధర్మము ననుసరించి,
పాపసంగతి జాలించి, పుణ్యకీర్తి
నెపుడు సత్కర్మ శీలుడౌ మానవుండు,
దైవ కృపచేత సర్వకాలంబులందు,
శాంతి, సత్యంబు వీడక శమదమాది
సకల సాధన సంపత్తి, సాధువృత్తి
గలిగి యనిశంబు యధ్యాత్మ యోగమునను,
దనివి తీరంగ తామర పూవుపైని,
వ్రాలి తేనెను త్రావెడి తేటికరణి,
ఈశ్వరధ్యాన మకరంద పానమునను,
సర్వమును వీడి, సంపూర్ణ జీవనమును,
పడసి బ్రహ్మ పదంబును బడయగోరు
మానవుడె పో నిలలోన మహితయశుడు,
ముక్తిగోరెడి పురుషుండు, మృత్యుజయుడు.


ఇ. సు. కృ.

—— ——

## విజ్ఞప్తి.

ధర్మసాధనికి చందాదారులుగ నుండగలరని తమకు తోచిన వారి విలాసముల తెలుప పత్రికాభిమాను లెల్లరు ప్రార్థితులు. ధ. సం.

—— ——



## ఫౌంటెన్ కలము.

1. "బ్లాకు బర్డు" ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో రు. 3- 0-0
2. "హార్డు వేరు". " 14 ct " 2- 8-0
3. "శ్వాన్" " 14 ct బంగారు పాళీతో కలది. ప్రశస్తమైనది 5- 8-0
4. "వాటరు మెన్ ఐడియల్" ఫౌంటెన్ పేనా 14 క్యారట్ల బంగారు పాళీ కలది, మిక్కిలి నాణ్యము 7- 0-0
5. "ప్రిమియరు" " 14 ct బంగారు పాళీతో " 5- 8-0

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునపుడు, సన్నపుపాళీ కావలెనో, ముదుగుపాళీ కావలెనో వ్రాయవలయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్శిలు ద్వారా పంపుదుము. కావున, దూరమునందున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసుకు వ్రాసికోవలెను.

యమ్. హెచ్. రావు అండు సన్సు, తపాలాపెట్టె నెం. 29, కాకినాడ.

## కేసరి—రత్నత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్టు కామంపుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్య సమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల.
ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజాపూరు.

తాంబూలవిహారము:—తాంబూలము వుపయోగించువారికి ఇది ముఖ్యముగా మనస్సునకు సంతోషము నిచ్చెడు వాసనగల వస్తువు. వెల డబ్బి 1 కి అణాలు 4, వి. పి. శెలవు 1 మొదలు 12 డబ్బీలవరకు అణాలు 8 ప్రత్యేకము.

సోడావాటర్ పవుడర్:—ఈ చూర్ణములో కొంచమెత్తు చల్లనీళ్ళలో కలిపినట్లయితే స్వయమైన సోడావాటర్ అవును. 1 సీసాలోని పవుడరు 8 సీసాలు సోడావాటర్ చేయుటకు తగుమైనది. వెల సీసా 1 కి అణాలు 6, వి. పి. శెలవులు 1 మొదలు 4 సీసాల వరకు 8 అణాలు ప్రత్యేకము,

లిమినెడ్ పవుడర్:—ఈ చూర్ణములో కొంచమెత్తు మంచినీళ్ళలో కలిపినయెడల అది మంచిలెమనెడ్ గా తయారవును. ఒక బుడ్డిలోవున్న చూర్ణము సుమారు 8 పెద్దబుడ్లు లిమినెటు చేయవచ్చును, వెల బుడ్డి 1-కి అణాలు 6, వి. పి. శెలవులు 1 మొదలు 4 బుడ్లవరకు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

అమృతాంజనము.

సుందరమైన 1921 ఉపయోగమైన

క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనే వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు,

బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

అమృతాంజనము డిపో,

౧౦౯, ఫ్రేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదాసు.

ఇది చూడవద్దు

చూచినచో మరువవద్దు

వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్యులుగారి

ఇన్ఫ్లుయెన్జా

కలరా ప్లేగు

వ్యాధులకు జగత్ప్రసిద్ధి చెందిన

ఆయుర్వేద దివ్యౌషధములు

మా కలరా, ప్లేగుమందులకు

ముఖ్యప్రాశస్త్యము

20 వత్సరములుగ ఇండియా, బర్మా, సిలోన్, ఏడెన్ మొదలగు చోట్ల అనేక వేల ప్రాణులను, కలరా, ప్లేగునుండి

కాపాడుటయే

కలరా శెట్టు 1-కి రు 1-2-0

ప్లేగు శెట్టు 1-కి రు 2-2-0

ఇన్ఫ్లుయెన్జా శెట్టు 1-కి రు 1-12 0

క్యాటలాగు ఉచితము. ప్యాకింగు పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ఆయుర్వేదాశ్రమం,

41 ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.



Reg. No. M. 1094.

The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.


To M. R. Ry. V. P. Rs. As.

61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.